క్లుప్తంగా

వార్డుల వారీగా సవరణ



వార్డు, కుటుంబాల వారీగా సవరణ చేస్తున్న కార్యదర్శులు

శివ్వంపేట(నర్సాపూర్): సమగ్ర సర్వేకు సంబంధించి వివరాలు సవరణలో సిబ్బంది నిమగ్నమయ్యారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీలకు సంబంధించి చేసిన సర్వేని కుటుంబాలు, వార్డుల వారీగా సవరింపులు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు చేపట్టారు. ప్రభుత్వం సూచించిన విధంగా 100 శాతం సమగ్ర సర్వే డాటా ఎంట్రీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ స్వామి, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న డేటా ఎంట్రీ

కౌడిపల్లి(నర్సాపూర్): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ రాత్రి సైతం కొనసాగుతోంది. కలెక్టర్ ఈరోజు డేటా ఎంట్రీ, వార్డుల వారీగా సర్వే పత్రాల విభజన పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు ఆపనిలో బీజీగా ఉన్నారు. శుక్రవారం రాత్రి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు బలరాం, గులాంసలానితో పాటు వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు రాత్రి వరకు ఉండి డేటా ఎంట్రీ చేయిస్తున్నారు. మండలంలోని మొదట 10,200 కుటుంబాలు ఉండగా సర్వేలో ప్రస్తుతం కుటుంబాల సంఖ్య 11,067 పెరిగినట్లు చెప్పారు. పంచాయతీల్లోని వార్డుల సర్వేప్రతాలను విభజించి బెండిల్స్ ఏర్పాటు చేసి, ట్రంక్‌పెట్టెలో భద్రపర్చనున్నట్లు ఎంపీడీఓ చెప్పారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చదవడం, రాయడం చేయించడంతో పాటు రికార్డులను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సమయ పాలన పాటిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు.

పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న హెచ్‌ఎం సాయిరెడ్డి, సంస్థ ప్రతినిధులు

చిన్నశంకరంపేట(మెదక్): సీఎస్ఆర్ నిధులతో మండలంలోని సూరారం జెడ్పీపాఠశాలలో మూడు తరగతి గదుల నిర్మాణానికి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు భూమిపూజ చేశారు. శుక్రవారం సూరారం జెడ్పీపాఠశాల హెచ్‌ఎం సాయిరెడ్డి, రౌండ్ టెబుల్, హైదరాబాద్ టైటాన్స్ సంస్థ నిర్వాహకులు వీఎస్‌టీ పరిశ్రమ సహకారంతో భవన నిర్మాణాలకు భూమి చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సాయిరెడ్డి మాట్లాడుతూ.. వీఎస్‌టీ పరిశ్రమ ద్వారా రూ.60 లక్షల సీఎస్ఆర్ నిధులను సమకూర్చిన రౌండ్ టెబుల్, హైదరాబాద్ టైటాన్స్ సంస్థ నిర్వాహకులు చైతన్య, లోకేశ్‌లను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ప్రతినిధులు పవన్, నాగరాజు, గోవర్ధన్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ మాధవి, గ్రామ కార్యదర్శి నాంపల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడితేనే బంగారు భవిష్యత్

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులు కష్టపడితేనే బంగారు భవిష్యత్ ఉంటుందని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సతీశ్ అన్నారు. శుక్రవారం పేటలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్సెస్సీ, ఆయా తరగతుల విద్యార్థులకు సైబర్ నేరాలతో పాటు షీటీం, డ్రగ్స్ వినియోగంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై గ్రామాల్లో తల్లిదండ్రులకు విద్యార్థులు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, హెచ్‌ఎంలు రాజేశ్వర్, విఠల్, మారుతి, ఎస్ఆర్‌పీ ప్రసన్నకుమార్, ఎంఐఎస్ సంపత్‌రెడ్డి, సీఆర్‌పీ వెంకటేశం ఉన్నారు.



మాట్లాడుతున్న సీఎంఓ సతీష్

అంబేడ్కర్ ఆదర్శనీయుడు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయా గ్రామాల్లో ఆయన చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



చిన్నశంకరంపేటలో ..



పాపన్నపేట(మెదక్): నాగ్సాన్‌పల్లిలో...



నర్సాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం, బీఎస్పీ నాయకులు



చేగుంటలో ..



మెదక్ మున్సిపాలిటీ: అంబేడ్కర్ కాలనీలో..



తూప్రాన్ పట్టణంలో ..



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పాపన్నపేట(మెదక్): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఈ విషయాన్ని సమాజంలోకి తీసుకెళ్లాలని విజన్ సొసైటీ ఆర్గనైజర్ రవి విద్యార్థులను కోరారు. శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలతో వచ్చే సమస్యలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాలతో బాలికల ఆరోగ్యం దెబ్బ తింటుందని అన్నారు. పుట్టబోయే శిశువులపై ప్రభావం ఉంటుందని చెప్పారు. ఎదుగుదల లోపించడం ద్వారా రోగ నిరోధకశక్తి తగ్గి పోతుందని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు వచ్చిన తర్వాతనే వివాహం చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేసుకోమని, వాటిని అరికట్టడానికి కృషి చేస్తామంటూ విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

నర్సాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌తో పాటు పలువురు నాయకులు శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వర్గీకరణ వెంటనే చేయాలని, లావణి భూములకు సంపూర్ణ పట్టాలు అందజేయాలని, దళితుల్లో అర్హులైన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సంఘం నాయకులు కుమార్, సంజీవులు, నాగరాజు, నర్సింలు, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి విగ్రహ ప్రతిష్ఠ



భక్తులకు గురుచరిత్ర పుస్తకాలు అందజేస్తున్న విగ్రాం రాజన్‌గౌడ్

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని శ్రీ మానిక్‌ప్రభు దేవాలయంలో గణపతి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పురోహితులు కృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో జరగనున్న దత్తజయంతి, సప్తాహ కార్యక్రమం సందర్భంగా పేటకు చెందిన విగ్రాం రాజన్‌గౌడ్ గురుచరిత్ర పుస్తకాలను భక్తులకు ఉచితంగా అందజేశారు. ఆలయ కమిటీ బాధ్యులు పున్నయ్య, సర్వేశ్వర్, సీతారం, రవివర్మ, సతీష్‌గౌడ్, రామకృష్ణ, సత్యనారాయణ, సాయితేజ తదితరులు ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయం చేయాలి



చేగుంటలో అవగాహన కల్పిస్తున్న ఇషా ఫౌండేషన్ ప్రతినిధి జయలేఖ

చేగుంట(తూప్రాన్): సేంద్రియ వ్యవసాయం చేయడంతోనే నేలను కాపాడుకోవచ్చని అన్నారు. చేగుంటలో నేల రక్షణ వారోత్సవాల్లో శుక్రవారం రైతులకు సెహగల్ ఫౌండేషన్ హైటెక్ సీడ్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నేలను కాపాడుకునేందుకు చేపట్టాల్సిన పద్ధతులు వివరించారు. జీవ కోటికి ఆధారమైన నేలను భావితరాల కోసం కాపాడాల్సిన అవసరం ఉందని, దీనికోసం రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, లీడ్ వాణి, ఫీల్డ్ అసిస్టెంట్లు విజయ్, శ్రవణ్, రైతులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

రేగోడ్(మెదక్): సీఎం కప్ కోసం ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న క్రీడాపోటీలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి మల్లేశం కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ ఆటల పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీతారావమ్మ, తహసీల్దార్ నరేశ్, ఎస్ఐ పోచయ్య, ఎంఈఓ గురునాథ్, సూపరింటెండెంట్ రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి మల్లేశం

శ్రద్ధగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలి



పంపిణీ చేసిన స్వెట్టర్లతో విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని అశోక్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ శివకుమార్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని పాంబండ ఉన్నత పాఠశాలలోని 105 విద్యార్థులకు అశోక్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్వెట్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారెందరో ఉన్నత స్థాయిల్లో ఉన్నారన్నారు. సమాజంలో విద్యకు ఉన్న ప్రాధాన్యత మరేదానికి లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయులు శాస్త్రుల వామనశర్మ, శ్రీధర్‌రావు, జగదీశ్వర్‌రావు, చెన్నానాయక్, శ్రీవాణి ఉన్నారు.

జీవో 317 ను రద్దు చేయాలి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తపస్ ఆధ్వర్యంలో జీవో 317 రద్దు చేయాలని జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సుకన్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానికతను ఆధారంగా చేసుకొని ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో జీవో 317 కారణంగా చాలా మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పక్క జిల్లాలకు కేటాయింపబడ్డారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన 48 గంటల లోపల 317 జీవోను రద్దు పరుస్తామని తెలిపారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 317 జీవోను రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులను స్థానిక జిల్లాలకు కేటాయించాలని తపస్ మెదక్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాంపూర్ హెచ్‌ఎం పద్మారెడ్డి, ఉపాధ్యాయులు అర్జున్, చంద్రకాంత్, నరేశ్, కుమారస్వామి పాల్గొన్నారు.



రాంపూర్‌లో మాట్లాడుతున్న తపస్ నాయకులు

వరి కొయ్యల కాల్చివేతపై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ రాజేశ్‌కుమార్

అల్లాదుర్గం(మెదక్): పంట కోతలు అయిన తర్వాత మిగిలిన పంట అవశేషాలను కాలిస్తే వాయు, నేల కాలుష్యం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రాజేశ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లిలో వరికొయ్యల కాల్చివేతపై అవగాహన కల్పించారు. పంట అవశేషాలు కాల్చడం వలన మీథేన్, కార్బన్ మోనాక్సైడ్, అస్థిర సేంద్రియ సమ్మేళనాలు, కార్సినోజెనిక్ పాలీసైక్లిక్ సుగంధ హైడ్రోకార్బన్‌లు వంటి హానికరమైన వాయువులను కలిగి ఉన్న పెద్ద మొత్తంలో విషపూరిత కాలుష్య కారకాలను వాతావరణంలో విడుదలవుతుందన్నారు. రసాయన పరివర్తనకు లోనయి దట్టమైన పొగమంచును కలిగించడం ద్వారా చివరికి మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. పంట అవశేషాలు కాల్చకుండా నేలలో రోటవేటర్‌తో కలియ దున్ని, నీటి తడి ఇచ్చి, ఎకరానికి 50 కిలోల సింగల్ సూపర్ ఫాస్పెట్, 10–15 కిలోల యూరియా పంట పంట అవశేషాల పైన చాల్లాలన్నారు. ఈ వరి కొయ్యలు 20–30 రోజుల్లో కుళ్లిపోతాయి. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్, అమృత్, విష్ణు, విఠల్‌రావు, రైతులు బెతయ్య, సాయిలు, నర్సింలు, కుమార్ పాల్గొన్నారు.

కరెంట్ కోతతో ఇబ్బందులు

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం ఉదయం నుంచి కరెంట్ సరఫరాలో అనేక సార్లు అంతరాయం ఏర్పడడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు. తెల్లవారుజామున పలుమార్లు సరఫరాలో అంతరాయం కల్గిందని, మధ్యాహ్నం, సాయంత్రం మాటిమాటికి కరెంట్ పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వినియోగదారులు చెప్పారు. తెల్లవారు జామున, సాయంత్రం పూట కరెంట్ పోవడంతో విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తుందని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఏఈ రాంమూర్తిని వివరణ కోరగా.. పట్టణంలో కరెంట్ సరఫరాలో అంతరాయం తన దృష్టికి రాలేదని చెప్పారు. మళ్లీ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పాడిపశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని వీరోజిపల్లిలో పాడిపశువులపై పశువైద్యాధికారి నాగార్జున పాటిల్ రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు పశువులు రోగాల బారిన పడకుండా టీకాలు వేయించాలని, పశుగ్రాసం పెంపకంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఆత్మచైర్మన్ దాచ సంగమేశ్వర్, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, గోపాలమిత్ర మల్లేశం గౌడ్, మహేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

సర్టిఫికెట్లతో వచ్చి వాహనాలు తీసుకెళ్లండి

పట్టణ సీఐ నాగరాజు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణ పోలీస్ స్టేషన్‌లో వాహనాల తనిఖీలో పట్టుకున్న వాహనాలు, యాక్సిడెంట్, నెంబర్ ప్లేట్ లేని వాహనాలు 20 ఉన్నాయని సీఐ నాగరాజు శుక్రవారం తెలిపారు. వాహనదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని వచ్చి వాహనాలు తీసుకెళ్ల వచ్చునని తెలిపారు. పూర్తి సమాచారం కోసం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

8న మహాపడిపూజ

నర్సాపూర్: ఈనెల 8న నర్సాపూర్‌లో అయ్యప్ప స్వామి మహాపడిపూజ చేస్తున్నట్లు హరిహర శివాలయం సన్నిధాన మాలధారులు తెలిపారు. మహాపడి పూజ పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో చేపడుతున్నామన్నారు.

బెండ సాగు.. లాభాలు బాగు

- చీడలు, పెట్టుబడి, తక్కువే

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతి ఏటా సాగు చేసే వరి, పత్తి పంటలతో అంతంత మాత్రంగా లాభాలు పొందిన ఓ రైతు, వినూత్నంగా ఆలోచించాడు. తనకున్న పొలంలో 20 గుంటల్లో బెండసాగు చేస్తూ మంచి లాభాలు పొందుతున్నాడు. మండలంలోని అజ్జమర్రి గ్రామానికి చెందిన రైతు ఇరుగుపల్లి హన్మంతు తనకున్న ఐదెకరాల పొలంలో వరితో పాటు పంటమార్పిడిలో భాగంగా బెండకాయ సాగు చేస్తున్నాడు. తన తోటి రైతుల సలహాల మేరకు హన్మంతు బెండకాయ పంటకు మొదటి నుంచి కాయ కోతకు వచ్చేవరకు సుమారు రూ. 20 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. అందులో బెండవిత్తనాలకు రూ. 5 వేల వరకు ఖర్చు కాగా, దుక్కి దున్నకాలు, మందుల పిచికారీ ఖర్చులకు మరో రూ.15 వేల వరకు అయ్యాయన్నారు. బెండకాయ సాగు చేపట్టిన 45 రోజుల్లో కోతకు వచ్చాయని, దినం తప్పించి దినం కాయ కోస్తే సుమారు రెండు క్వింటాళ్ల వరకు కాత వస్తుందన్నారు. కాసిన బెండకాయలను రోజూ కచ్చితంగా కోయాలని, కోయకుండా వదిలేస్తే ముదురుతాయన్నాడు. కాసిన బెండకాయలను తామే పటాన్‌చెరు మార్కెట్ తీసుకువెళ్లి అక్కడ దళారులకు అమ్ముతామని, ప్రస్తుతం బెండకాయ ధర రూ. 45 ఉందన్నాడు. కొన్ని రోజులు రూ. 50 వచ్చేవన్నారు. ఇప్పటివరకు బెండసాగులో పెట్టుబడి రూ. 20 వేలు పెడితే, ఇప్పటి వరకు సుమారు లక్ష వరకు ఆదాయం వచ్చిందన్నాడు. సన్నకారు రైతులకు ఎక్కువ కూలీలు అవసరం లేకుండా తక్కువ పెట్టుబడితో, ఎక్కువ లాభాలు గడించేందుకు బెండసాగు బాగుంటుందన్నాడు. ముఖ్యంగా బెండసాగుకు చీడపీడలు తక్కువే, ఎక్కువ సమస్యలు ఉండవు. 45 రోజుల్లో 10–12 రోజులకోసారి మందులు పిచికారీ చేస్తే సరిపోతుంది. సరైన పద్ధతిలో, సరైన సీజన్‌లో సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చు. పైగా ఇది వేసవి పంట. ఎండ ఎంత ఎక్కువగా ఉంటే కాత అంత బాగుంటుంది. ముఖ్యంగా పంట మార్పిడితో నేల సైతం సారవంతమవుతుంది. ఎరువులు, సస్యరక్షణ చర్యలు తక్కువ.



అజ్జమర్రిలో బెండకాయలు కోస్తున్న రైతులు

సంక్షిప్త వార్తలు

◆ ఆలయ అభివృద్ధికి కృషి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్‌లోని పురాతన సోమేశ్వరాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం తన సొంత నిధులతో ఆలయం వద్ద బ్రాహ్మణ నివాస భవన నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. సమాజంలో ప్రతీ ఒక్కరు భక్తిమార్గాన్ని అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు శాస్త్రుల రాజశేఖరశర్మ, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

◆ వైస్ చైర్మన్‌గా కీర్తన

శివ్వంపేట(నర్సాపూర్): మున్నూరు కాపు సంఘం రాష్ట్ర మహిళా వినియోగదారుల సహకార సంఘం వైస్ చైర్మన్‌గా మండల పరిధిలోని ఎదుల్లాపూర్ మాజీ సర్పంచ్ కీర్తన నియమితులయ్యారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లిలో జరిగిన రాష్ట్ర మున్నూరు కాపు సంఘం సమావేశంలో ఆమెకు నియామక పత్రం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తమరావు అందజేశారు. దీంతో ఆమెను హరికృష్ణ, పలువురు కుల సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు సన్మానించారు.

◆ నిరుపేదలకు చేయూత

హవేళిఘణాపూర్(మెదక్): ఆపదలో ఉన్న పేదలకు తనవంతు సాయం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని లీల స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ మోహన్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సర్దన గ్రామ యువకుడు మహేశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి ఆయన నిత్యావసర సరుకులు, నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీకాంత్, కృష్ణ, భూమయ్య, అశోక్ ఉన్నారు.

◆ కాంగ్రెస్ మండల యువజన అధ్యక్షుడిగా ప్రసాద్

కొల్చారం(నర్సాపూర్): మండల యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా రంగంపేట గ్రామానికి చెందిన ప్రసాద్(చందు) ఎన్నికైనట్లు మండలాధ్యక్షుడు మల్లేశం గౌడ్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సహకరించిన పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు కతజ్ఞతలు తెలిపారు.

◆ భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ



కొల్చారం(నర్సాపూర్): మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలో శుక్రవారం అయ్యప్పస్వామి మహాపడిపూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వెంకట్‌గౌడ్ ఆధ్వర్యంలో గురుస్వాములు హరిదాసు, వైద్య రాజు పంతులు మహాపడిపూజ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

◆ 18న పుత్ర కామెష్టియాగం

నర్సాపూర్: పట్టణంలోని ఈనెల 18న ఆశ్రమంలో పుత్రకామెష్టి యాగం నిర్వహిస్తున్నట్లు సువిజ్ఞాన ఆశ్రమం వ్యవస్థాపకుడు ఆచార్య సత్యవీర్ తెలిపారు. సంతానం కోసం ఎదురుచూస్తున్న దంపతులు ఈ యాగంలో పాల్గొనాలని ఆయన సూచించారు. యాగంలో పాల్గొన దలచిన దంపతులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. తమను 92488 28666, 79817 50006 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవడంతో పాటు మరిన్ని వివరాలు పొందవచ్చని ఆచార్య సత్యవీర్ వివరించారు.

◆ 8న ఉచిత వైద్య శిబిరం

రామాయంపేట(మెదక్): పట్టణంలోని సత్యసాయి సేవా సదనంలో ఈనెల 8న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సేవా సమితి జిల్లా కన్వీనర్ యాచం లక్ష్మీనారాయణ తెలిపారు. హైదరాబాద్‌లోని ఏషియన్ వాస్కులర్ ఆస్పత్రి వారు ఈవైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. రక్త నాళాలకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలిపారు.

◆ ఉస్మానియా యూనివర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడిగా ధృహన్

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రానికి చెందిన చెలిమెల ధృహన్ ఉస్మానియా యూనివర్సిటీలో ఏబీవీపీ అధ్యక్షుడిగా గురువారం ఎన్నికయాడు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు ఆయనను అభినందించారు.